

గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న మైసూరు జిల్లా యంత్రాంగం

ఉత్సవాలకు ఆహ్వానం

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొనాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప నేతృత్వంలో జిల్లా యంత్రాంగం గురువారం ఆహ్వానించింది. రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను మైసూరు సంప్రదాయ తలపాగాతో సత్కరించి ఆహ్వానపత్రికను అందజేశారు. జిల్లా అధికారి లక్ష్మీకాంతరెడ్డి, నగర పోలీస్ కమిషనర్ సీమాలాట్కర్, జిల్లా పంచాయతీ సీఈఓ కేఎం గాయత్రి, అదనపు జిల్లా కలెక్టర్ శివరాజ్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం సీఎం అధికారిక కార్యాలయం 'కృష్ణ' లో ముఖ్యమంత్రి సిద్దరామయ్యను వారు కలిశారు. మైసూరు పేటా, పట్టుశాలువాతో సత్కరించి ఉత్సవాలకు ఆహ్వానం పలికారు.



సీఎం సిద్దరామయ్యను ఆహ్వానిస్తూ..



- ముడా వివాదంతో పీకల్లోతు కష్టాల్లో సీఎం
- సిద్దరామయ్యతోపాటు ఆయన భార్యపైనా కేసు
- ముఖ్యమంత్రికి అండగా అధిష్టానం, మంత్రులు
- మాజీ స్పీకర్ కోళివాడ వ్యతిరేక స్వరం
- రాజీనామాకు బీజేపీ డిమాండ్..
- పలుచోట్ల నిరసనలు

ఏ క్షణంలోనైనా.. ఎఫ్ఐఆర్..!



సీఎంకు వ్యతిరేకంగా నిరసనలో బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ముడా ఇంటి స్థలాల అవినీతి వివాదంలో సీఎం సిద్దరామయ్య పూర్తిగా ఇరుక్కున్నారు. హైకోర్టుతోపాటు ప్రజాప్రతినిధుల కోర్టు కూడా ఆదేశాలు ఇవ్వడంతో ఇక లోకాయుక్త రంగంలోకి దిగడమే తరువాయిగా మారింది. సీఎం సిద్దరామయ్య భార్య పార్వతి పేరిట ముడా 14 ఇంటి స్థలాలు మంజూరు చేయడంతో దంపతులు ఇద్దరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు కానుంది. మంగళవారం హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం సీఎం సిద్దరామయ్య పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఇచ్చిన ప్రాసిక్యూషన్‌లకు అనుమతులకు గ్రీన్‌సిగ్నల్ లభించినట్లయ్యింది. దాదాపు నెలన్నరకాలంగా ముడా ఇంటి స్థలాల వివాదంలో మైసూరుకు చెందిన సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ బెంగళూరు ప్రజాప్రతినిధులకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఎటువంటి చర్యలకు వీలు లేకుండా పోయింది. హైకోర్టులో వాయిదాలకు అనుగుణంగా ప్రజా ప్రతినిధుల కోర్టులోనూ తదుపరి చర్యలు తీసుకోరాదని సంకేతాలు ఉండేవి. హైకోర్టు ప్రాసిక్యూషన్‌కు అనుమతులతో బుధవారం ప్రజాప్రతినిధుల కోర్టు కూడా స్పందించింది. సీఎంను విచారణ జరపాలని మైసూరు లోకాయుక్తను ఆదేశించింది. దీంతో మైసూరు జిల్లా లోకాయుక్త ఎస్పీ రంగంలోకి దిగాల్సి ఉంది. మరోవైపు జేడీఎస్ కార్యకర్తలు హైకోర్టు ప్రతిని మైసూరు లోకాయుక్త అధికారులకు సమర్పించారు. వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

రాజీనామాకు ప్రతిపక్షాల డిమాండ్

సిద్దరామయ్యపై ప్రతిపక్షాలు రాజీనామాకు డిమాండ్ చేస్తున్నాయి. బెంగళూరులో బీజేపీ నిరసన చేపట్టింది. ముఖ్యమంత్రి బాధ్యతగా వెంటనే రాజీనామా చేయాలని కోరారు. విధానసౌధలో గాంధీవిగ్రహం వద్ద శాసనసభ్యులు, సీనియర్ నేతలు ఆందోళన చేశారు. ప్రతిపక్షనేత అశోక్‌తోపాటు మాజీ డీసీఎం గోవింద కారజోళ, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణ స్వామి, ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్, జగ్గేశ్ సహా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవినీతి సిద్దరామయ్య విచారణ ఎదుర్కోవాలని, జైలుకు వెళ్లేందుకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విధానసౌధకు తాళం వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పలుప్రాంతాలలో ఆందోళనలు కొనసాగాయి.

అందుబాటులో లేని లోకాయుక్త ఎస్పీ

గురువారం ఫిర్యాదుదారుల్లో ఒకరైన స్నేహమయి కృష్ణ మైసూరు లోకాయుక్త కార్యాలయానికి వెళ్లి ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. ఎస్పీ ఉదేశ్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కిడ్నాప్‌నకు గురయ్యాడని సంచలన ఆరోపణ చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు స్నేహమయి కృష్ణ లోకాయుక్త కార్యాలయం వద్దనే గడిపారు. ఎస్పీ కార్యాలయానికి రాకపోవడంతో లోకాయుక్త ఏడీజీపీకి ఫోన్‌లో సంప్రదించి కేసు నమోదుకు డిమాండ్ చేశారు. సమగ్ర విచారణలు 90 రోజులలో పూర్తి చేయాలనే ఆదేశాలు ఉండడంతో లోకాయుక్త ఆచితూచి వ్యవహరిస్తోంది. గురువారం సాయంత్రం లోకాయుక్త ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఆ తర్వాత బెంగళూరుకు బయల్దేరారు. సీఎం సిద్దరామయ్యపై అవినీతి కుట్ర పన్నారని, ప్రజాప్రతినిధిగా ఉంటూ సొంతలాభం కోసం ప్రయత్నించారనే సెక్షన్‌లకింద కేసు నమోదయ్యే అవకాశం ఉంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఒకేసారి ఒకే కేసులో ముఖ్యమంత్రి దంపతులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది.

మూడు రోజులు... మైసూరులోనే సీఎం

ముడా కేసు కొనసాగుతున్న తరుణంలోనే సీఎం సిద్దరామయ్య మూడు రోజుల మైసూరు పర్యటన కొనసాగించనున్నారు. శుక్రవారం ఉదయం మైసూరుకు వెళ్లే సీఎం 29వ తేదీ వరకు అక్కడే ఉంటారు. జిల్లా యంత్రాంగం, పర్యాటక శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. యథావిధిగా అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.



మాజీ స్పీకర్ కేబీ కోళివాడ

సీఎంకు అండగా అధిష్టానం, మంత్రులు

సీఎం సిద్దరామయ్యకు ఇప్పటివరకు మంత్రులు అండగా ఉన్నారు. అయితే కాంగ్రెస్‌లో నాయకులు వ్యక్తిగత స్వాతంత్ర్యంతో మాట్లాడతారనేది తెలిసిన విషయమే. ఏమాత్రం అధిష్టానం వెనుకడుగు వేసినా విమర్శలు చేసేందుకు క్యూ కడతారు. శాసనసభ స్పీకర్‌గా వ్యవహరించిన కేబీ కోళివాడ వినూత్నంగా స్పందించారు. సిద్దరామయ్య పదవికి రాజీనామా చేసి కేసును ఎదుర్కోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు తేరాదన్నారు. ఇటువంటి విమర్శలు తలెత్తుతాయని మరింతమంది మాట్లాడతారని, పార్టీలో అప్పుడే గుసగుసలు మొదలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బాగల్కోట జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హునగుంద తాలూకా దన్నూర గ్రామ శివారులోని టోల్‌ప్లాజా సమీపాన గురువారం తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. క్యాంటర్‌ను కారు ఢీ కొనడంతో జరిగిన ప్రమాదం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న విజయపుర జిల్లా బిదరకుండి గ్రామానికి చెందిన లక్ష్మణవడ్డర్ (55), బైలప్ప బిరాదార్ (45), రామణ్ణ నాయక్ (50), కారు డ్రైవర్ రఫీక్‌ముల్లా (25) అక్కడికక్కడే మృతి చెందారు. హొసపేటకు వెళ్లి ముద్దేబిహాళ్ నుంచి హునగుందవైపు వెళ్తుండగా క్యాంటర్‌ను వెనుకవైపు నుంచి కారు ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. కారు డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. హునగుంద పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



నుజ్జునుజ్జయిన కారు

నో ఎంట్రీ..!



- రాష్ట్రంలో సీబీఐకి ప్రవేశం లేదు..
- కేబినెట్ సమావేశంలో తీర్మానం
- పశ్చిమబెంగాల్, తమిళనాడు తరహాలో నిర్ణయం

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కేబినెట్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కేసులకు సంబంధించి సీబీఐ నేరుగా విచారణ జరిపే ప్రక్రియకు చెక్ పెట్టేలా తీర్మానించింది. గురువారం సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 28 అంశాలు కేబినెట్ ముందు ప్రస్తావనకు రాగా రెండింటిని పెండింగ్‌లో పెట్టారు. మిగిలిన 26 అంశాలకు మంత్రివర్గం తీర్మానించింది. అందులో ప్రధానంగా క్రిమినల్ కేసులకు సంబంధించి సీబీఐ విచారణకు అంగీకరించేలా ఢిల్లీ పోలీసులు స్థాపించిన 1946 సెక్షన్ 6 ప్రకారం గెజిట్‌ను రద్దు చేస్తున్నట్లు శాసనసభ, న్యాయ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వెల్లడించారు. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం కేంద్ర దర్యాప్తు సీబీఐ తమ అధికార పరిధిలో విచారణ జరిపేందుకు సంబంధిత రాష్ట్రాల నుంచి అనుమతులు పొందాల్సి ఉం టుంది. సీబీఐ లేదా కేంద్ర దర్యాప్తు సంస్థలు కార్యాచరణ జరిపేవేళ వివేచనతో వ్యవహరించడం లేదనే కారణంతోనే రాష్ట్రంలో ఇకపై నేరుగా సీబీఐ విచారణ జరిపే విధానాన్ని రద్దు చేశామన్నారు. సీబీఐ పరిధిలో ఉండే అన్ని కేసులకు చార్జ్‌షీట్‌లు సమర్పించడం లేదని, కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని, కొన్నింటికి సంస్థ దారి తప్పేలా వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ దారి తప్పేలా వ్యవహరిస్తున్నందున గెజిట్‌ను వాపసు తీసుకోవాలని నిర్ణయించామన్నారు. ప్రతి కేసును పరిశీలించాకనే సీబీఐ దర్యాప్తుకు అప్పగించేలా తీర్మానిస్తామని హెచ్‌కే పాటిల్ తెలిపారు. ముడా ఇంటి స్థలాల వివాదంలో ముఖ్యమంత్రి ఎదుర్కొంటున్న కేసులకు, కేబినెట్ తీర్మానానికి ఎటువంటి సంబంధం లేదన్నారు.

కేబినెట్ ముందుకు రావాల్సిందే...

ఇటీవల గవర్నర్ పలు వివాదాలకు సంబంధించి లేఖలు రాస్తున్నారని, పదే పదే సమాచారం కోరుతూ ఒత్తిడి తీసుకొస్తున్నారని ఇకపై గవర్నర్ కోరిన ప్రతి లేఖకు సమాధానం కేబినెట్ ముందుకు రావాల్సిందేనని తీర్మానించామన్నారు. నెల రోజుల వ్యవధిలో గవర్నర్ పలు అంశాలపై వివరణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖలు రాశారన్నారు. వాటిని కేబినెట్ ముందుకు రాకుండానే పంపేందుకు వీలు లేదని చీఫ్ సెక్రటరీకి సూచిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు.

గవర్నర్‌తో మరింత దూరం

రాష్ట్ర ప్రభుత్వం, రాజ్‌భవన్‌ల మధ్య దూరం పెరుగుతోంది. ఇటీవలే వైస్‌చాన్స్‌లర్ల నియామక ప్రక్రియను ప్రభుత్వమే కొనసాగించేలా తీర్మానించారు. కొన్నేళ్లకాలంగా ప్రభుత్వ యూనివర్సిటీలకు గవర్నర్ చాన్స్‌లర్‌గా వ్యవహరించే విధానం ఉంది. వైస్‌చాన్స్‌లర్‌లను ఆయనే నియమిస్తారు. కానీ నేరుగా రాష్ట్రప్రభుత్వమే నియమించేలా తీర్మానించా రు. తాజాగా కేబినెట్‌లోనూ గవర్నర్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి వివిధ అంశాలు, పెండింగ్ కేసులు, ఆరోపణలకు సంబంధించి సమాచారం కోరుతూ రాస్తున్న లేఖలకు చెక్ పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా గవర్నర్ లేఖ పంపితే ప్రభుత్వ ప్రధానకార్యదర్శి బదులిచ్చేవారు. కానీ ఇకపై కేబినెట్‌లో చర్చ జరిగిన తర్వాతే గవర్నర్‌కు సమాధానం పంపాలని తీర్మానించారు. అటు కేంద్రప్రభుత్వం, ఇటు రాజ్‌భవన్‌తో ప్రభుత్వం ఎటువంటి పరిస్థితులకైనా సై అనేలా సిద్ధమైంది. సీబీఐ దర్యాప్తును రాష్ట్రంలో నేరుగా కొనసాగించరాదనేలా పశ్చిమబెంగాల్, తమిళనాడు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నాయి. తాజాగా రాష్ట్రం కూడా జాబితాలో చేరింది.





మంత్రి జమీర్ కోర్టు ధిక్కారం..!

- ఫిర్యాదు చేస్తాం ..
- సామాజిక కార్యకర్త టీజే అబ్రహాం
- ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు : మంత్రి



బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ముడా వివాదంలో కోర్టు తీర్పు రాజకీయ ప్రేరేపితమని వ్యాఖ్యానించిన వక్ఫ్, వసతిశాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్‌పై కోర్టు ధిక్కార ఫిర్యాదు చేస్తామని సామాజిక కార్యకర్త టీజే అబ్రహాం తెలిపారు. ముడా ఇంటిస్థలాల వివాదంలో గవర్నర్ ఆదేశాలు సముచితమని, సీఎం సిద్దరామయ్య పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసిన సంగతి తెలిసిందే. కోర్టు తీర్పు తర్వాత మంత్రి జమీర్‌అహ్మద్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. ముడా ఇంటి స్థలాల వివాదంలో ముఖ్యమంత్రిపై ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త టీజే అబ్రహాం గురువారం బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. శుక్రవా రం లేదా శనివారం కోర్టు ధిక్కారానికి సంబంధించి ఫిర్యాదు చేస్తామన్నారు. జమీర్ అహ్మద్ తరచూ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారని ఆయన ఆరోపించారు. కాగా హైకోర్టు తీర్పు రాజకీయ ప్రేరేపితమని తాను ఎక్కడా వ్యాఖ్యానించలేదని మంత్రి జమీర్ వివరణ ఇచ్చారు. గురువారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ హైకోర్టు తీర్పు పట్ల ఎక్కడా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని అన్నారు.

జెన్నీమిల్క్‌పై 278 ఫిర్యాదులు

- రూ.13.51 కోట్ల గోల్‌మాల్ జరిగినట్లు నిర్ధారణ
- సీఐడీ దర్యాప్తునకు నివేదన
- విజయ నగర ఎస్పీ హరిబాబు



బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 26: జెన్నీమిల్క్ వ్యవహారం రోజుకో కొత్తమలుపు తిరుగుతోంది. ఇప్పటి వరకు గాడిద పాల సరఫరాకు సంబంధించి 278 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు అందడంతో నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ హరిబాబు మీడియాకు వివరించారు. గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన గాడిద పాల కొనుగోలులో జెన్నిమిల్క్‌కంపెనీపై ఫిర్యాదులు వెల్లువెత్తు తున్నాయని, ఇప్పటివరకు రూ 13.51కోట్లు గోల్‌మాల్ జరిగినట్లు తేలిందని, కేసును సీఐడీకి అప్పగించాలని కోరినట్లు ఎస్పీ వివరించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు నూతలపతి మురళి, మరో నలుగురి ఆచూకీ కోసం మూడు బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిందితులు చిక్కితే ఈ కేసుకు సంబంధించి మరిన్ని ఆధారాలు లభించే అవకాశం ఉందన్నారు. జెన్నీమిల్క్ సంస్థను నమ్ముకుని లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి చేతులు కాల్చుకున్న రైతులు ధైర్యంగా ఉండాలని, నిందితులను వీలైనంత త్వరలో అరెస్టు చేస్తామనే విశ్వాసాన్ని ఎస్పీ వ్యక్తం చేశారు. నకిలీలను వదిలే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

గుండెల్లో గుడి కట్టుకున్న అభిమానం

- దివంగత పునీత్ రాజ్‌కుమార్‌కు ఆలయం కట్టిన అభిమాని
- ఆవిష్కరించిన అప్పు భార్య అశ్విని




బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తన అభిమాన నటుడికి గుడి కట్టించాడు ఆ అభిమాని. హావేరి జిల్లా యలగచ్చ గ్రామంలో దివంగత పునీత్‌రాజ్‌కుమార్ పేరిట నిర్మించిన ఆలయాన్ని అశ్విని పునీత్ రాజ్‌కుమార్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. సినీ రంగంలో ఎంతో పేరొంది కర్ణాటక రత్నగా పేరొందిన పునీత్‌రాజ్‌కుమార్‌కు రాష్ట్రవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. పునీత్ ఆకస్మిక మరణంతో ఎందరో అభిమానులు గుండెలు పగిలిన సంగతి తెలిసిందే. అప్పుకు రాష్ట్రంలో అభిమానులకు తావులదు. యలగచ్చ గ్రామానికి చెందిన ప్రకాశ్ తన ఇంటి సొంతస్థలంలోనే నటుడు పునీత్ రాజ్‌కుమార్‌కు ఆలయాన్ని నిర్మించారు. గురువారం ఆరు అడుగుల పునీత్ విగ్రహాన్ని ఆయన భార్య అశ్విని లాంఛనంగా ఆవిష్కరించారు. తొలుత ఆమె ఉడచ్చమ్మ దేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. అశ్వినికి గ్రామస్తులు ఆత్మీయంగా పూర్ణకుంభాలతో స్వాగతించారు. పునీత్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆమె భావోద్వేగానికి గురయ్యారు. అభిమాని ప్రకాశ్ కుమార్తెకు ఆపేక్షా అని నామకరణం చేశారు. అభిమానులే నటులకు దేవుళ్లతో సమానమని అశ్విని అభిప్రాయపడ్డారు. ఇన్నేళ్లయినా పునీత్‌ను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్న అభిమానులను తాను మరువలేనని, వారి రుణం తీర్చుకోలేదని పేర్కొంటూ కన్నీళ్లు పెట్టారు. కాగా ప్రకాశ్ మాట్లాడుతూ 8 నెలలుగా పునీత్ ఆలయ నిర్మాణం కోసం పాదరక్షలు ధరించలేదన్నారు. గురువారం ఆలయం ప్రారంభం కావడంతో వేసుకుంటున్నట్లు తెలిపారు. పెద్దసంఖ్యలో అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

పునీత్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అశ్విని

మడికేరి దసరాకు ఏర్పాట్లు

- దశమంటపాల సంబరాలకు కసరత్తు
- ఉట్టిపడనున్న కొడగు సంస్కృతి

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మడికేరి దసరాలో దశమంటపాల ఊరేగింపునకు సంబంధించి కొడగు జిల్లా అధికారి నేతృత్వంలో కసరత్తు ప్రారంభమైంది. మైసూరులో దసరా ఉత్సవాలు జరిగే రోజుల్లోనే కొడగు జిల్లా మడికేరిలోనూ కరగ ఉత్సవ కమిటీ, ప్రత్యేక వేడుకలు జరిపే సంప్రదాయం దశాబ్దాలుగా ఆనవా యితీగా ఉంది. కొడగు జిల్లా సంస్కృతి భిన్నంగా ఉంటుంది. ఇక్కడ ప్రతి వేడుకకు స్త్రీ పురుషులు నృత్యాలతోపాటు వేడుకలను ప్రత్యేకంగా ఆచరిస్తారు. కొడగు సంస్కృతిలో అతిథులకు ఆహ్వానం పలకడం ఎంతో అపురూపంగా ఉంటుంది. ఆధునిక కాలంలోనూ వారు తమ సంప్రదాయాలను వదిలేయకుండా పాటిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తుంటారు. అందుకు తగ్గట్టుగానే డీజేలు ఏర్పాటు చేస్తారు. మడికేరి దసరా సంస్కృతి భిన్నంగా ఉంటున్నందున ఈ ఏడాది అదే రీతిలో కొనసాగాలని స్థానికులు కోరుతున్నారు. అయితే డీజే ఏర్పాట్లకు కోర్టు నిబంధనలు ఉన్నాయని జిల్లా అధికారి స్పష్టం చేశారు. దీంతో ఉత్సవాలు సజావుగా జరపడం ప్రస్తుతం సవాల్‌గా మారుతోంది. నాడహబ్బ దసరాలో పది మండపాల ఊరేగింపు సంబరాలకు తలమానికంగా నిలుస్తుంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.84	1,619.35
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11,368	1,524
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	12,033	9,620
సామర్థ్యం (టీఎంసీలు)	101.15	59.53

ఘనంగా విద్యాసాగర్ జయంతి



జయంతి వేడుకలను నిర్వహిస్తున్న ఏఐడీఎస్ఓ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 26: నగరంలోని విమ్స్ మైదానం, ఐటీఐ గ్రౌండు, వార్న కళాశాలలో గురువారం ఏఐడీఎస్ఓ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మానవతావాది ఈశ్వరచంద్ర విద్యాసాగర్ 204వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు కే.ఈరన్న మాట్లాడుతూ, 150 ఏళ్ల క్రితం విద్య కొన్నివర్గాల సొత్తు మాత్రమేనని, అట్టడుగు తరగతుల వారి కలల తలుపులు మూసుకుపోయాయన్నారు. దీనికి వ్యతిరేకంగా గ్రామ గ్రామానా వెళ్ళి ప్రచారం చేయడం వల్ల నేడు అన్ని తరగతుల ప్రజలకు, బాలికలకు విద్యా తలుపులు తెరుచుకున్నాయన్నారు. బాల్యవివాహాల నిషేధానికి వ్యతిరేకంగా ఆయన పోరాడారన్నారు. విద్యాసాగర్ సైన్స్ ఎకనామిక్స్, గణితం, ఆంగ్ల విద్య ప్రాముఖ్యతను నొక్కి చెప్పారన్నారు. అటువంటి మహానుభావుల బాటలో మనమూ మన గళం వినిపించాలన్నారు. ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షురాలు శాంతి, ప్రజాప్రతినిధులు రాధ, మహమూద్ షమీహుల్లా, సురేశ్‌బాబు, అంటోనితో పాటు విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

నీటిపన్ను కట్టని వారికి నోటీసులు


ఇంటింటికీ వెళ్లి నోటీసులు అందజేస్తున్న సిబ్బంది

గంగావతి రూరల్, సెప్టెంబరు 26: గంగావతి నగరసభ పరిధిలో ఏళ్ళతరబడి నీటిపన్ను చెల్లించని నీటికనెక్షన్‌లు కట్ చేస్తామని ఎన్నిసార్లు ఆదేశాలు జారీ చేసినా పట్టణ ప్రజలు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఈ నేపథ్యంలో చివరి సారిగా ఏకంగా నీటిపన్ను కట్టని కనెక్షలు కలిగిన వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు నగరసభ కమీషనర్ విరుపాక్షప్ప తెలిపారు. నోటీసులు అందిన ఏడు రోజుల్లోపు పన్ను చెల్లించక పోతే కనెక్షన్ కట్ చేస్తామని నోటీసులో పొందుపరిచినట్లు తెలిపారు. ఒకవేళ ఇంటిలో ఎవరూ లేకపోతే ఇంటిగోడకు నోటీసులు అంటిస్తామని తెలిపారు. గంగావతి నగరసభ పరిధిలో ప్రజలు ఇంటి, నీటి పన్నులు తప్పకుండా నిర్ణీత సమయంలో చెల్లించి నగరాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

కర్మాగారాలపై చర్యలు తీసుకోండి


తమను ఆదుకోవాలని మనవిపత్రం ఇస్తున్న రైతులు

కంప్లి, సెప్టెంబరు 26: సండూరు తాలుకా పరిధిలోని నరసింగాపుర గ్రామం వద్ద వున్న రణజిత్ పుర స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ వల్ల చుట్టుపక్కల పొలాలు పూర్తిగా నీరు కలుషితమవుడంతో పాటు పొగ, దుమ్ము ధూళి వల్ల రైతన్నలు పూర్తిగా నష్టపోయారని రైతు సంఘం రాజ్యాధ్యక్షులు మాధవరెడ్డి తెలిపారు. గురువారం సండూరు తహసీల్దార్ అనిల్ కుమార్‌కు ఈ మేరకు మనవిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరసింగపుర గ్రామం చుట్టూ వున్న కర్మాగారాల వల్ల పంటలు చేతికి రాక ఎండిపోయి నష్టపోతున్నారన్నారు. దీంతో పాటు వేస్టేజ్ ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. ఈ విషయంపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికే వ్యవసాయాధికారి మంజునాథరెడ్డికి రైతులు మనవిపత్రం అందించారన్నారు. వెంటనే రణజిత్‌పుర స్పాంజ్ ఫ్యాక్టరీవల్ల నష్టపోయిన రైతులను ఆదుకుని నష్టపరిహారం అందించాలన్నారు.

దేవర సినిమా విడుదల సందడి



- టపాసులు పేల్చిన ఎన్టీఆర్, పవన్ అభిమానులు
- స్వీట్లు పంపిణీచేసిన తెలుగు వారు


థియేటర్ వద్ద ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేసిన దృశ్యం

సిరుగుప్ప, సెప్టెంబరు 26: దేవర సినిమా సందడి భారీఎత్తున జరుగుతోంది, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, పవన్ కళ్యాణ్ అభిమానులు బాలాజీ థియేటర్ వద్ద భారీ ఎత్తున ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేసి డీజే సౌండ్లతో డ్యాన్సులు, చిందులు వేస్తున్నారు. సినిమాను ఎప్పుడు చూస్తామా అని ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. సిరుగుప్పలో వుండే రెండు థియేటర్లలోను దేవర రిలీజ్ అవుతోంది. భారీ ఎత్తున అభిమానులు తరలిరావడంతో ట్రాఫిక్ జామ్ అయింది. అభిమానులు భారీ ఎత్తున టపాసులు పేల్చగా, తెలుగువారు స్వీట్లు పంపిణీ చేశారు.

ఎన్టీఆర్, ఏఎన్ఆర్ ఇద్దరూ కళామతల్లి ముద్దుబిడ్డలే!

ఘనంగా ఏఎన్ఆర్ 101వ జయంత్యుత్సవం

బళ్లారి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు ఇద్దరూ సినీరంగానికి రెండు కళ్ల లాంటివారని, వీరు పోషించిన పాత్రలు, నటించిన సన్నివేశాలు అత్యద్భుతమని సమతా సాహితీట్రస్టు సభ్యులు, విశ్రాంత ఉపాధ్యాయుడు సురేంద్రబాబు అభిప్రాయపడ్డారు. బళ్లారి రాఘవ కళామందిర్‌లో గురువారం అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతి ఉత్సవాలను సమతా సాహితీ ట్రస్టు ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి రాఘవ కళామందిర్ గౌరవాధ్యక్షుడు చెన్నప్ప, అధ్యక్షుడు కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అక్కినేని అభిమాని అయిన సురేంద్రబాబు మాట్లాడుతూ ఏఎన్ఆర్ నటించే రోజుల్లో ఆడవాళ్ల వేషాలు వేయడానికి ముందుకొచ్చేవారు కాదని అలాంటి ఆడవాళ్ల వేషాల్లో ఆయన అత్యద్భుతంగా నటించారని చెప్పారు. మేఘసందేశం, ప్రేమాభిషేకం, ఇలాంటి ఎన్నో అద్భుతమైన చిత్రాలతో ఆయన ప్రజల మనసుల్లో నిలిచిపోయాడన్నారు. తాను పోషించాల్సిన పాత్ర ఏంటని అర్థం చేసుకున్న మహా వ్యక్తి అన్నారు. ఎన్టీరామారావు ఒక భిన్నమైన కథానాయకుడైతే ఏఎన్ఆర్ మరో భిన్నమైన నటుడని పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు జీఆర్ వెంకటేశులు మాట్లాడుతూ.. పౌరాణిక సినిమాలు, నాటకాలను నేటి తరానికి పరిచయం చేయాల్సిన బాధ్యత ఎంతో వుందని పేర్కొన్నారు. అనంతరం కళాకారులు రామాంజినేయులు, జీ ప్రభాకర్, కే రామాంజినేయులు, దేవన్న, ఎం రామాంజినేయులు, సుధాకర్, మాధవీలత, భీమినేని భాస్కరనాయుడు తదితర అక్కినేని అభిమానులు మాట్లాడారు.


కళాకారులను సన్మానించిన సమతా సాహితీ ట్రస్టు సభ్యులు

కళాకారులకు సన్మానం: వివిధ కళారంగాలలో రాణించిన వారిని సమతా సాహితీ ట్రస్టు తరపున శాలువా, పూలమాలలతో సన్మానించారు. గౌరవాధ్యక్షులు చెన్నప్ప, కే.కోటేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్, చల్లా అమర్‌నాథ్‌రెడ్డి, బి గంగన్న, బీ శ్రీనివాసులు, వలీ అహ్మద్, రఘురామ్, నాగభూషణం, పీఎం నటరాజు, వెంకటేశ్వర్లను కూడా సన్మానించారు. ఈ సందర్భంగా వలీ అహ్మద్ అక్కినేని పాటలు, పద్యాలను ఆలపించగా, సురేంద్రబాబు అక్కినేని డైలాగులతో విశేషంగా ఆకట్టుకున్నారు.

హంపిలో స్వచ్ఛతాహీ సేవ / పర్యాటక దినోత్సవంలో పాల్గొన్న అధికారులు


స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన ప్రజలు, అధికారులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 26: ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా హంపీలో పర్యావరణ స్వచ్ఛతాహి సేవ ప్రారంభమైంది. విజయనగరం జిల్లా పర్యాటక శాఖ, భారతపురావస్తుశాఖ, గ్రామపంచాయితీల సహకారంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. బసవన్న మండపం వద్ద టూరిజం శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రభులింగ ఎస్ తలకేరి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా హంపీ బజార్, టూరిజంశాఖ ప్రాంగణం, మాతంగ పర్వత రహదారి తదితర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో భారత పురావస్తు శాఖ అధికారులు అనిరుడ్ దేశాయి. సునీల్‌కుమార్, హంపి గ్రామపంచాయితీ పీడీఓ గంగాధర్, ఛైర్ పర్సన్ రజనీ షణ్ముఖ, హోటల్ మయూర భువనేశ్వరి మేనేజర్ సునీల్, టూర్ గైడులు, పర్యాటక మిత్రులు పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణతోనే మాతాశిశు మరణాల నివారణ

- జడ్పీ సీఈఓ శరణప్ప సంకనూరు


మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ శరణప్ప సంకనూరు

బళ్లారి సిటీ, గాంధీనగర్, సెప్టెంబరు 26: గర్భిణులు ప్రతి నెలా పరీక్షలకు వచ్చినప్పుడు వైద్యాధికారులు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసి మాతా శిశు మరణాల నివారణకు కృషిచేయాలని జిల్లాపంచాయితీ ముఖ్యకార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పంచాయితీ హాల్లో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా ఆరోగ్య అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ కుటుంబంలోనూ ప్రసవం సమయంలో గర్భిణీ మహిళలను పోగొట్టుకోవడానికి ఇష్టపడరని, గర్భిణులు తీసుకోవాల్సిన జగ్రత్తలు ఎప్పటికప్పుడు వారికి తెలియజెప్పాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. గర్భిణి అనే విషయం తెలిసిన రోజు నుంచి ప్రసవం అనంతరం 45 రోజుల వరకు బాలింతలను అత్యంత సీరియస్‌గా పరిగణించాలని, రక్తపోటు, మధుమేహ వ్యాధి, రక్తహీనత, తదితర వాటి బారిన పడకుండా వైద్య సిబ్బంది జాగ్రత్త వహించాలని సూచించారు.

గర్భిణులకు అవసరమైన టీకాలు, ఐరన్ మాత్రలు లాంటివి పంపిణీ చేస్తూ ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తుండాలన్నారు. స్కానింగ్ అవసరమైతే ఆలస్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి తరలించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ యల్లా రమేష్ బాబు మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా మాతాశిశు మరణాలు అరికట్టడానికి మూడు అంశాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రసూతి గదులు, వార్డుల పరిశీలనతోపాటు అంటువ్యాధులు ప్రబలకుండా విమ్స్ ప్రసూతి ఆసుపత్రి నిపుణులతో సమాలోచన నిర్వహించనున్నట్లు సిఇఓకు వివరించారు. ఇదే విషయంలో తాలూకాల్లో క్షేత్ర స్థాయి సిబ్బందితో సభలు, సమాలోచన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీంతో సార్వత్రిక టీకా కార్యక్రమాలు సక్రమంగా అమలు పరచడంతో పాటు అత్యవసర సమయంలో 108 ఆరోగ్యకవచ లేదా ఏబిఎస్ అంబులెన్స్‌లను సకాలంలో అందుబాటులో ఉండేలా చూసుకోనున్నట్లు వివరించారు. కుక్కకాటు కేసుల్లో సకాలంలో వైద్యం అందించేందుకు మందుల కొరత లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు శస్త్ర చికిత్స శిబిరాలకు ఎక్కువ మంది అబ్దిదారులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా రాబీస్‌కు సంబంధించిన పోస్టర్‌లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా సర్జన్ డాక్టర్ ఎన్.బసరెడ్డి, విమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ కొట్రేష్, డాక్టర్ అబ్దుల్లా, డాక్టర్ పూర్ణిమా కట్టమని, డాక్టర్ మరియంబి, డాక్టర్ ఇంద్రాణి, డాక్టర్ వీరేంద్ర, డాక్టర్ హనుమంతప్ప, తాలూకా ఆరోగ్యఅధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాధికారుల సమస్యలను పరిష్కరించాలి

- బళ్లారిలో నల్లబ్యాడ్జీలతో నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామ ఆడళిత అధికారులు సంఘం నాయకులు

బళ్లారి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తమసమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం కర్ణాటక రాజ్య గ్రామ అడళిత అధికారుల సంఘం ఆధ్వర్యంలో బళ్లారిలో నల్లబ్యాడ్జీలతో నిరసనలు చేపట్టారు. జిల్లాలోని అన్ని గ్రామాల నుండి గ్రామ అడళిత అధికారులు డీసీ కార్యాలయం వద్దకు చేరుకుని నల్లబ్యాడ్జీలతో నిరసనలో పాలొన్నారు. సంఘం అధ్యక్షుడు ఎం. సురేష్ మాట్లాడుతూ ఈనెల 22న చిత్రదుర్గం జిల్లాలో రాష్ట్రంలోని 31 జిల్లాల అధ్యక్షులు, పదాధికారులు సమావేశం నిర్వహించామని తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామ అడళిత అధికారి బాధ్యతలు పెరిగాయన్నారు. సంయోజన, ఇ- ఆఫీస్, ఆధార్ సీడ్, ల్యాండ్ బిట్, ఇలా దాదాపు 21 అంశాలను సాంకేతికంగా జతకలిపి పనిచేయడం వలన ఒత్తిడికి లోనవుతున్నామని పేర్కొన్నారు. జిల్లా ధ్యక్షుడు సురేష్ తోపాటు ఉపాధ్యక్షులు నందీష్, సెక్రెటరీ కార్తీక్, పద్మ, జాయింట్ సెక్రెటరీ శశిధర్, నరేంద్ర కుమార్, ట్రెజరల్ బి. సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ అకౌంటెంట్ల సమస్యలను పరిష్కరించండి


డిప్యూటీ తహసీల్దార్ సత్యమ్మకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సిరుగుప్ప, సెప్టెంబరు 26: తమకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సిరుగుప్ప తాలుకా విలేజ్ అకౌంటెంట్ల సంఘం అధ్యక్షులు విరుపాక్షి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిరుగుప్ప పట్టణ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాష్ట్ర విలేజ్ అకౌంటెంట్ల సంఘం పిలుపుమేరకు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విరుపాక్షి మాట్లాడుతూ విలేజ్ అకౌంటెంట్లను నూతన డిజిటల్ యాప్ ఏర్పాటు చే యడంతో ప్రతి రోజు పనిగంటలు పెరిగాయన్నారు. ధర్నాలో హనుమంతప్ప, మంజునాథ, విలేజ్ అకౌంటెంట్లు పరమేష, సుదేంద్ర తదితరులు పాల్గొన్నారు.


నిరసనలో మాట్లాడుతున్నమంజునాథ

కంప్లి, సెప్టెంబరు 26 : గ్రామాల్లో విధులు నిర్వహించే తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని గ్రామలెక్క అధికారుల సంఘం అధ్యక్షులు మంజునాథ తెలిపారు. గురువారం కంప్లి పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గ్రామలెక్క అధికారులు, నిరసన చేపట్టారు. తహసీల్దార్‌కు మనవిపత్రాన్ని అందించారు. వారితో పాటు మహిళా అధ్యక్షురాలు వనితకుమారి, మంజునాథ, ప్రధాన కార్యదర్శి శివరుద్రప్ప, కోశాధికారి సురేష్ కరేగౌడ, రాఘవేంద్ర, సుష్మ, మనోజ్, లక్ష్మణ నాయక్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్ రద్దు కోరుతూ ఆందోళన



ఎన్‌పీఎస్ విధానం రద్దు చేయాలనిఆందోళన చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

బళ్ళారి గాంధీనగర్, సెప్టెంబరు 26: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఎక్కువ లాభాలు తెచ్చేందుకోసం ప్రభుత్వ ఉద్యోగులను బలిపశువులను చేస్తోందని అఖిల కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, బళ్ళారి జిల్లా విభాగం పేర్కొంది. ఓల్డ్ పెన్షన్ విధానం స్థానంలో నేషనల్ పెన్షన్ స్కీమ్‌ను ప్రవేశ పెట్టిందని దీంతో ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనడంతో పాటు జీవన పర్యంతం ఆర్థిక సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల ఎన్‌పిఎస్ విధాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లాధికారి కార్యాలయం ముందు వందలాది మంది ఉద్యోగులు ఆందోళన చేపట్టారు.

ఆర్టీవో శ్రీనివాస్ గిరికి ఘన సన్మానం


శ్రీనివాస్ గిరిని సన్మానిస్తున్న దృశ్యం

బళ్లారి రూరల్, సెప్టెంబరు 26 : బళ్లారి ఆర్టీవో కార్యాలయంలో నూతన ఆర్టీవో శ్రీనివాస్ గిరిని జింఖానా షటిల్ బ్యాడ్మింటన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైఎస్ తిప్పేస్వామి మాట్లాడుతూ శ్రీనివాస్ గిరి 33 సంవత్సరాల పాటు ఏఆర్టీవోగా సేవలు అందించి ప్రమోషన్‌పై ఆర్టీవో కావడంతో ఆయనను సన్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్ చంద్రశేఖర్‌గౌడ, శేఖర్, ప్రసాద్‌బాబు, రామ దూత బాబు, నెల్లూరు ప్రసాద్, వేణు సురేష్, ప్రవీణ్, మంజునాథ, మల్లికార్జున, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్


సామలపట్టి ఆసుపత్రిలో వైద్యసేవల గురించి అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

హోసూరు సెప్టెంబరు 26 : సామలపట్టి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గర్భిణి స్త్రీల వార్డు, తల్లుల వార్డులను గురువారం జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రస్తుత నెలలో పిల్లల జననం, తల్లుల, శిశువుల ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు, అలాగే వైద్యులు, నర్సులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి ఆసుపత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు, ఉపయోగించని వస్తువులను తనిఖీ చేశారు, ఆసుపత్రిల్లో అవసరమైన పడకలు, వీల్ ఛైర్లు, సరిగ్గా ఉన్నాయా అనే కోణంలో తనిఖీలు చేపట్టారు. అనంతరం సామలపట్టి ప్రభుత్వం హయ్యర్ సెకండరీ పాఠశాలలోని పౌష్టికాహార కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు వండిన ఆహారాన్ని తిని నాణ్యతను పరిశీలించారు. రోజు అందించే ఆహారం నాణ్యత, రుచి, పాఠ్యాంశాలపై పాఠశాల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గతేడాది 10వ తరగతి నుంచి 12 వ తరగతి ఉత్తీర్ణతపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత విద్యాసంత్సరంలో నిరంతరం పర్యవేక్షించి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా పాఠ్యాంశాలను నిర్వహించాలన్నారు, అలాగే పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారులు డాక్టర్ కవిన్, డాక్టర్ బానుప్రియ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు

హోసూరు, సెప్టెంబరు 26: హోసూరు పేరండపల్లిని కలిపే శాటిలైట్ టౌన్ రింగ్ రోడ్డు (ఎస్‌టీఆర్ఆర్ బటర్‌ప్లై) ప్రాంతంలో ప్రజా ప్రయోజనాల కోసం సర్వీస్ రోడ్డు నిర్మించాలని పేరండపల్లి ప్రజలు పార్లమెంట్ మాజీ ఎంపీ తంబిదురైకి వినతిపత్రం అందించారు. ఆయన పేరండపల్లి ప్రదేశాన్ని గురువారం సందర్శించి పరిశీలించారు. తర్వాత ఆయన వెంటనే ఢిల్లీలోని సెంట్రల్ నేషనల్ హైవేస్ డైరెక్టర్‌ను కలిసి ప్రజల డిమాండ్లపై చర్చిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

ఔషధాలపై ఏఐ టెక్నాలజీ ప్రభావం.. సదస్సు

హోసూరు సెప్టెంబరు 26: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి వైద్యరంగంల్లో అమలు చేస్తున్న ఔషధాలపై హోసూరు సెయింట్‌పీటర్స్ కళాశాల ఆఫ్ ఫార్మసీ క్యాంపస్‌లో గురువారం సదస్సుజరిగింది. ఎడ్యుకేషన్ గ్రూఫ్ సెక్రటరీ డాక్టర్ లాసియా తంబిదురై కొవ్వొత్తి వెలిగించి సదస్సును ప్రారంభించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్ ఆనంద స్వాగతం పలికారు. ఈ సెమినార్‌ల్లో అభివృద్ధి, సాంకేతిక పరిణామాలపై చర్చించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి వైద్యరంగంల్లో అమలు చేస్తున్న ఔషధాలపై చర్చించారు. ఈ సెమినార్‌లో ప్రత్యేక ఆహ్వానితులుగా మదర్ థెరిసా ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ కవిమణి, ఫార్మసీకళాశాల కోయంబత్తూరు ప్రొఫెసర్ రామకృష్ణ, మహిళా ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ వివేకానంద తదితరులు పాల్గొన్నారు. సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల మెడికల్ డైరెక్టర్ రాజాముత్తయ్య, మెడికల్ సూపరిండెంట్ వాసుదేవుడు హాజరయ్యారు.


సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

పకడ్బందీగా పథకాలు అమలు చేయాలి

- ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సమితి అధ్యక్షుడు నరేంద్ర స్వామి



ప్రగతి సమీక్షా సమావేశంలో పాల్గొన్న నరేంద్రస్వామి తదితరులు

రాయచూరు సెప్టెంబర్ 26 : ఎస్సీఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మరింత పకడ్బందీగా అమలు చేయాలని శాసన మండలిలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సమితి అధ్యక్షుడు నరేంద్రస్వామి సూచించారు. పథకాల అమలుకు సంబంధించి గురువారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో ప్రగతి పరిశీలన సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన నరేంద్ర స్వామి మాట్లాడుతూ, లబ్దిదారుల ఎంపిక మొదలుకొని పథకాలను అందించే వరకు అన్ని కార్యక్రమాలను సజావుగా సకాలంలో జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. విద్యాపరంగా అత్యంత వెనకబడి ఉన్న రాయచూరు జిల్లాలో డ్రాప్ ఔట్‌లు పెరుగుతుండడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో డ్రాప్‌ఔట్‌లలో ఎస్సీఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులే ఎక్కువగా ఉండడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. పాఠశాలలు, కలాశాలల్లో చదివే ఎస్సీఎస్టీ విద్యార్థులకు సకాలంలో విద్యార్థి వేతనాలు అందేలా ఆ శాఖ అధికారులు చూడాలన్నారు. ఎక్కడెనా సమస్యలెదురైతే వెంటనే జడ్పీ సీఈఓ దృష్టికి తీసుకోరావాలన్నారు. ఉపాధి హామి పనుల్లో జిల్లా అగ్రస్థానంలో ఉన్నప్పటికీ ఎస్సీఎస్టీ జాతుల వారికి పని దినాలు కల్పించడంపై ఇప్పటికి సమగ్ర విధానం లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి సరఫరా చేపట్టిన గ్రామాల్లో ఎస్సీఎస్టీ కాలనీలకు తొలి ప్రాధాన్యతనివ్వాలని నరేంద్ర స్వామి ఆదేశించారు. వసతి పథకం లబ్దిదారుల ఎంపికలో ఎస్సీ,ఎస్టీ కులాలకు సంబంధించిన లబ్దిదారుల జాబితాను ప్రత్యేకంగా సిద్ధం చేయాలన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో స్మశాన వాటికలు వసతి స్థలాలు, తాగునీటితో పాటు వ్యక్తిగత లబ్దిపొందే పథకాల అమలులో అధికారులు మరింత జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఎస్సీఎస్టీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక పథకాలు రూపొందిస్తున్నా వాటి అమలులో జరుగుతున్న జాప్యం వల్ల ఆశించిన ఫలితం దక్కడం లేదని ఈ సందర్భంగా నరేంద్ర స్వామి అన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

రాజారామ్ మోహన్ రాయ్ (వర్ధంతి)



సంఘసంస్కర్త రాజారామ్ మోహ న్ రాయ్ 1772 మే 22న బెంగాల్ ప్రాంతంలో జన్మించారు. బ్రిటీషుల కాలంలోనే అప్పటి సతీ సహ గమనం, బాల్య వివాహాల సాంఘిక దురాచారానికి అడ్డుకట్ట వేసేందుకు శ్రమిం చారు. వితంతు పునర్వి వాహం, స్త్రీ విద్యకు పాటు ఎడ్డారు. బ్రహ్మసమాజాన్ని ఏర్పాటు చేశారు. బెంగాల్ సాంస్కృతిక పునరు జ్జీవనంలో ము ఖ్యులుగా గుర్తింపు పొందారు. 1833 సెప్టెంబరు 27న కన్నుమూశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ (జయంతి)



నిజాం నిరంకుశ పాలనకు వ్యతి రేకంగా జరిగిన తెలం గాణ విముక్తి పోరాటంలో చురుగ్గా పాల్గొన్న నాయ కులలో ఒకరైన కొండా లక్ష్మణ్ బాపూజీ 1915 సెప్టెంబరు 27న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాంకిడిలో జన్మించారు. ప్రత్యేక తెలంగాణ కోసం మూడు దశల ఉద్యమంలో ప్రముఖపాత్ర పోషించారు. 1969లో తొలిదశ పోరాటంలో కీలకంగా ఉండి మంత్రి పదవిని కూడా త్యజించిన త్యాగశీలి. వాంకిడిలో లక్ష్మణ్ సేవాసదన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగించారు. 97వ యేట 2012 సెప్టెంబరు 21న కన్నుమూశారు.

పుహళేంది (జయంతి)



ప్రముఖ సంగీత దర్శకుడు పుహళేంది 1929 సెప్టెంబరు 27న త్రివేండ్రంలో జన్మించారు. అసలు పేరు వేళప్పన్ నాయర్. గురువు కేవీ మహదేవన్‌తో కలసి 15ఏళ్లలో 600 తమిళ, తెలుగు, మళయాళ సినిమాలకు పనిచేశారు. దక్షిణాదిన భక్తిపాటలకు ఆయన ప్రత్యేకం అనిపించారు. 2005 ఫిబ్రవరి 27న కన్నుమూశారు.

నగేష్ (జయంతి)




దక్షిణాది ప్రముఖ హాస్యనటుడు నగేష్ 1933 సెప్టెంబరు 27న తమి ళనాడులోని ధారాపురం ప్రాం తంలో జన్మించారు. ఆయన పూర్వీ కులు తుమకూరు జిల్లా తిపటూరు తాలూకా చెయ్యూరు ప్రాంత వాసు లు. ఆయన అసలుపేరు గుండూరావు. చిన్నప్పుడే ఏదో ఒక రంగంలో తన ప్రతిభ చాటుకున్నాకే తిరిగి వస్తా నని మద్రాస్ చేరుకున్నారు. రైల్వే కొంతకాలం పనిచేసి ఆపై నాటక రంగం నుంచి సినీరంగంలోకి ప్రవేశిం చారు. నవ్విస్తూనే ఏడిపించేవారాయన. అందుకే దక్షి ణాది చార్లీ చాప్లిన్‌గా అభివర్ణిస్తుంటారు. తెలుగు, తమి ళ, మళయాళ, కన్నడ భాషల్లో సుమారు వెయ్యికిపైగా సినిమాల్లో నటించారు. చివరగా కమలహాసన్ హీరోగా చేసిన 'దశావతారం'లో నటించారు. కళైమా మణి, నేష నల్ ఫిల్మ్ అవార్డు అందుకున్నారు. 2009 జనవరి 31న కన్నుమూశారు.

జి వరలక్ష్మి (జయంతి)



జీ వరలక్ష్మిగా సుపరిచితురాలైన గరికపాటి వరలక్ష్మి 1926 సెప్టెం బరు 27న ఒంగోలులో జన్మించారు. రంగస్థల, సినిమా నటి, గాయనీ మణి, నిర్మాత, దర్శకురాలు. 1940 - 60లమధ్య తెలుగు, తమిళ సినీ రంగాలలో పేరొందారు. సక్కుబాయి, రంగూన్‌రౌడీ నాటకాలు ఎంతో పేరొందాయి. బాలనటిగా బారిష్టరు పార్వతీశం సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టారు. మూడు దశాబ్దాలకుపైగా రాణించారు. 1968లో 'మూగ జీవులు' చిత్రానికి దర్శకత్వం వహించారు. 2006 నవం బరు 26న కన్నుమూశారు.

యశ్ చోప్రా (జయంతి)



ప్రముఖ హిందీ దర్శక, నిర్మాత యశ్ చోప్రా 1932 సెప్టెంబరు 27న జన్మించారు. యశ్ రాజ్ ఫిల్మ్స్ ప్రొడక్షన్స్ అండ్ డిస్ట్రిబ్యూషన్ స్థాప కులు. ఐదు దశాబ్దాలలో 50కు పైగా సినిమాలు నిర్మించారు. ఎందరో నటులకు అవకాశం కల్పించారు. 6 జాతీయ, 11 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్‌లతోపాటు పద్మభూషణ్, దాదాసాహెబ్‌ఫాల్కే పురస్కారాలు అం దుకున్నారు. 2012 అక్టోబరు 21న కన్నుమూశారు.

మాతా అమృతానందమయి (పుట్టినరోజు)



హిందూ ఆధ్యాత్మిక గురువు మాతా అమృతానందమయి 1953 సెప్టెం బరు 27న కేరళలో జన్మిం చారు. 'అమ్మ'గా పిలవబడుతూ మానవ తావాదిగా గుర్తింపు పొందారు. మాతా అమృతానంద మయి మఠం ఏర్పాటు చేసి ఏటా కోటిమందికి ఉచిత భోజనం సమకూరుస్తున్నారు. ఐక్యరాజ్య సమితిలో ప్రసంగిం చారు. దేశవ్యాప్తంగా వరదబాధితులు, నిరు పేదలకు 47వేల ఇళ్లను నిర్మించి ఇచ్చారు. విద్యా సంస్థలు, ఆసు పత్రులు కట్టించారు. 35భాషలలో వెయ్యికి పైగా భజనలు రాసి రికార్డు నెలకొల్పారు. విశ్వరత్న పుర స్కారం అందుకున్నారు.

ఆనంద శంకర్ జయంత్ (పుట్టినరోజు)



భరతనాట్య కళాకారిణి 'పద్మశ్రీ' గ్రహీత ఆనంద శంకర్ జయంత్ 1961 సెప్టెంబరు 27న తిరు నల్వేలిలో జన్మించారు. దక్షిణ మధ్య రైల్వేలో రైల్వే ట్రాఫిక్ సర్వీసులో తొలి మహిళా అధికారిని. 1972 నుంచి నృత్యరంగంలో తనదైన ప్రతిభతో గురువు, వక్త, కొరియోగ్రాఫర్‌గా, పండితురాలిగా రాణించారు. హైదరాబాద్‌లో 'శంకరానంద కళాక్షేత్ర' డ్యాన్స్‌స్కూల్ ఏర్పాటు చేశారు. నాట్య ఇళవరసి, నృత్య చూడామణి, కళైమామణి, కళారత్న తదితర గౌరవాలు అందు కున్నారు. 2009లో కేన్సర్‌పై ఆమె ప్రసంగాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. రెండేళ్ల అనంతరం కేన్స ర్‌ను జయించి ప్రస్తుతం సాధారణ జీవితం గడుపుతున్నారు.

గ్రామ పాలనాధికారులపై ఒత్తిడి తగ్గించండి



వినతిపత్రం అందజేత

బాగేపల్లి, సెప్టెంబరు 26: గ్రామ పాలనాధికారులపై ఒత్తిడి తగ్గించాలని, సౌలభ్యాలు కల్పించాలని కోరుతూ రాష్ట్ర గ్రామపాలనాధికారుల సంఘం పిలుపుతో తాలూకా కేంద్రం లోనూ గురువారం నిరవధిక ధర్నా చేపట్టారు. నల్లబ్యాడ్జీలను భుజాలకు కట్టుకుని నిరసన తెలిపారు. సంఘం తాలూకా అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం మొబైల్ యాప్‌ల ద్వారా ల్యాండ్‌బిట్, ఆధార్ నమోదు సహా పలు పనులు ఉంటాయన్నారు. ఇందుకు ల్యాప్ టాప్, ఇంటర్నెట్ సౌలభ్యం, ఉపకరణాలు కల్పించకనే ఒత్తిడి కల్పిస్తున్నారన్నారు. రాష్ట్ర సంఘం పిలుపుతో నిరవధిక ధర్నా కొనసాగించదలిచామన్నారు. తమ డిమాండ్లు కొన సాగేంత వరకు ధర్నా ఉంటుందన్నారు. గ్రామపాలనాధికారి ప్రీతమ్ మాట్లాడుతూ బగర్ హుకుం సాగు, భూమి, హక్కుపత్రాలు, ఆధార్‌సీడింగ్, ఎన్నికలు, ఆదాయ పన్నుశాఖ, బ్యాం కు పనులు ఇతరత్రా వాటికి 21 పనులకు మొబైల్ టెక్నాలజీ వాడాల్సి ఉంటుందన్నారు. ఇవన్నీ నిభాయించడం ఎంతో కష్టంగా ఉందన్నారు. అంతరజిల్లా బదిలీలు, భార్యాభర్తల బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. వినతిపత్రం స్వీకరించి తహసీల్దార్ మనీషా మహేశ్ మాట్లాడుతూ ఆందోళనకారుల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తెచ్చి పరిష్కరించేయత్నం చేస్తామన్నారు. గ్రామపాలనలో కీలకమైన పాలనాధికారులకు తగిన సౌలభ్యాలు కల్పించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గ్రామ పాలనాధికారులు బీసీ నరసింహప్ప, రోషిని, అభిషేక్, సంతోష్‌కుమార్, కేఎస్ వేణుగోపాల్, కిరణ్, ప్రియాంక, కీర్తి, రంజితా తదితరుల పాల్గొన్నారు. .

ఉద్యోగాల సృష్టి విద్యార్థి ఆలోచన కావాలి



రోహన్ ఎం గణపతికి జ్ఞాపిక అందచేస్తున్న చాన్స్‌లర్ శ్యామరాజు

▸▸ రేవాలో కోర్సుల ప్రారంభంలో రోహన్ ఎం గణపతి

బెంగళూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల సృష్టి ప్రతి విద్యార్థి ఆలోచన కావాలని బెల్లట్రిక్స్ ఏరోస్పేస్ సీఈఓ రోహన్ ఎం గణపతి అభిప్రాయపడ్డారు. రేవా యూని వర్సిటీలో 2024-25 అకడమిక్‌కు సంబంధించి బి-టెక్ కోర్సులను గురువారం లాంఛనంగా ప్రారంభించారు. యూనివర్సిటీలోని సౌగంధికలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొనగా చాన్స్‌లర్ పి శ్యామరాజు అధ్యక్షత వహించారు. రోహన్ ఎం గణపతి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ అంతరిక్షరంగంలో తమ సంస్థ ప్రగతిని వివరించారు. విద్యార్థులు ఆకాశమే హద్దుగా కలిగి ఉండాలన్నారు. కోర్సు ముగించేలోగా ఉద్యోగాన్వేషణ కాకుండా ఉద్యోగాలు సృష్టించే ఆలోచనలు పెంచుకోవాలని అటువంటివారికి నేను ప్రోత్సహి స్తానన్నారు. 19ఏళ్ల వయస్సులో ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో బెల్లట్రిక్స్ ఆలోచన వచ్చిందన్నారు. మేం కేవలం విద్యాజ్ఞానం కాకుండా నైపుణ్యతకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. చాన్స్‌లర్ డాక్టర్ శ్యామరాజు మాట్లాడుతూ రేవా విద్యార్థులు ఉన్నతశిఖరాలకు వెళ్లాలనేదే మా ఆశయమన్నారు. అందుకే నైపుణ్యత విషయంలో రాజీ లేదన్నారు. యువత ద్వారా ఉత్తమ సమాజం ఆశయంగా పెట్టుకున్నామన్నారు. డిగ్రీ అనేది కేవలం ఆరంభమేనని ఇది జీవితానికి తొలి మెట్టులాంటిదన్నారు. ప్రో చాన్స్‌లర్ ఉమేశ్ ఎస్ రాజుతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఏపీ సీఎం సహాయనిధికి విరాళం

బెంగళూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యుడు టీపీడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండు తలపనేని 2.50లక్షల రూపాయలు ఏపీ సీఎం సహాయనిధికి అందించారు. విజయవాడలో గురువారం సీఎం చంద్రబాబు నాయుడును స్వయంగా కలసి చెక్కును అందించారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి, బీటీఎఫ్ ముఖ్యులు కనకమేడల వీర, సోంపల్లి శ్రీకాంత్‌తోపాటు సభ్యులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా పాండు మాట్లాడుతూ విజయవాడలో నెలకొన్న వరదనష్టంపై ప్రజలను ఆదు కునేందుకు తనవంతుగా సాయం చేశానన్నారు. ప్రభుత్వం నిరంతరంగా సేవలందిస్తోందని ఎంతోమంది దాతలు సహకరిస్తున్నారన్నారు.



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేత

నగరంలో సర్ఫేస్ ఎక్స్‌పో ప్రారంభం

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నార్త్‌కు చెందిన లఘు ఉద్యోగ భారతి ఆధ్వర్యంలో సర్ఫేస్ ఎక్స్‌పో 2024ను నగరంలోని ప్యాలెస్ మైదానంలో గురువారం లాంఛనంగా ఆరంభమైంది. వర్నర్ ఫిన్‌లె కంపెనీ డైరెక్టర్, సీఈఓ విప్లవ్ జేజీ, చెరోన్ ఇండియన్ మిషన్ టూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాజేశ్ టి ఫాశి సదస్సును ప్రారంభించారు. మూడు రోజులపాటు సదస్సు కొనసాగనుంది. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6వరకు ఉంటుంది. ఈ ఏడాది అత్యా. దునిక సాంకేతికతపై దృష్టి సారించడంతో రక్షణ, విమాన యాన, పబ్లిక్‌సెక్టార్‌ల విభాగాలు ప్రముఖులను ఆకర్షిస్తోంది. లఘు ఉద్యోగ భారతి అధ్యక్షుడు సచ్చిన్ సాబ్నిస్ గౌరవ అతిథిగా, కేఎస్‌పీసీబీ అధికారి కేబీ కొట్రేశ్ ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేశారు. లఘు ఉద్యోగ భారతి బెంగళూరు ఉత్తర విభాగం అధ్యక్షుడు సంజయ్ పి భట్ మాట్లాడుతూ సరికొత్త సాంకే తికత, ఉత్పత్తులను అన్వేషించేలా, సహకారం, వ్యవహార వృద్ధికి వేదిక కానుందన్నారు. సదస్సు ముగింపులో ఈనెల 28న ఎంఎస్ఎంఇ మంత్రి శోభాకరంద్లాజె విచ్చేయనున్నారు. ప్రత్యేకించి పెయింటింగ్ రంగానికి సంబంధించిన పలు రకాల ఉత్పత్తులను, వివిధ పరికరాలను సదస్సు లో ప్రదర్శించారు.



ఎక్స్‌పోలో పాల్గొన్న ప్రముఖులు

ఫార్మా విద్యార్థులు నైపుణ్యత సాధించాలి

▸▸ పీఈఎస్ వీవీలో కోర్సులు ప్రారంభం

బెంగళూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫార్మా, నర్సింగ్, ఫిజియోథెరపీ అలైడ్ హె ల్త్‌సైన్స్ కోర్సులను పీఈఎస్ ఎలక్ట్రానిక్‌సిటీ క్యాంపస్‌లో లాంఛనంగా ప్రారంభించారు. రాజీ వ్‌గాంధీ వైద్యవిద్య యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ సచ్చిదానంద గురువారం కోర్సులను ప్రారంభించారు. విద్యార్థులు సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవడంతోపాటు వృత్తిలో నైపుణ్యత సాధించాలన్నారు. పీఈఎస్ మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సురేశ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉత్సాహం, ఉద్దేశ్యం, వృత్తిపరమైన అవగాహన, తెలుసుకోవాలనే తపన ప్రతి విద్యార్థిలో ఉండాలన్నారు. వైద్యవృత్తి బాధితరోగులకు సానుభూతి కలిగించేలా ఉండాలని అప్పుడే వారిలో ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. వైస్‌చాన్స్‌లర్ సూర్యప్రసాద్, సీఓఓ అజయ్‌కుమార్, రిజిస్ట్రార్ కేఎస్ శ్రీధర్, వీసీ నాగార్జునతోపాటు పలువురు పాల్గొన్నారు.



కోర్సుల ప్రారంభంలో ప్రముఖులు

సహకార బ్యాంకుల ప్రగతికి పాటుపడదాం



సమావేశం ప్రారంభంలో ఎమ్మెల్యే రవికుమార్ తదితరులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 26: తాలూకాలోని ఎంతోమంది మహనీయులు సహకార బ్యాంకు కోసం శ్రమించారని, పార్టీలకు అతీతంగా బ్యాంకు ప్రగతికి సహకరిద్దామని ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ అభిప్రాయపడ్డారు. తాలూకా ప్రాథమిక సహకారబ్యాంకు గ్రామీణాభివృద్ధి బ్యాంకు ఆవరణలో 86వ వార్షిక సర్వసభ్య సమావేశం, పీఎల్‌డీ బ్యాంకు నిర్మించిన దుకాణాల సముదాయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవలి కొన్నేళ్లలో రుణాల వసూళ్లు క్లిష్టంగా మారాయని, ఆర్థికంగా వెనుకబడి ఉండడంతో అసలు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేసేలా రాష్ట్రప్రభుత్వం ప్రకటించాక అనేకమంది రైతులు రుణాలను చెల్లించడంతో బ్యాంకు ఆర్థికంగా బలోపేతమైందన్నారు. వడ్డీమాఫీ కారణంగా సహకార బ్యాంకులకు, అన్నదాతలకు ఎంతో ప్రయోజనం సాధ్యమైందన్నారు. సహకార బ్యాంకుల ద్వారా పొందే ప్రయోజనాలు రైతులందరికీ దక్కేలా బ్యాంకు పాలకమండలి అధ్యక్షులు, డైరెక్టర్‌లు పార్టీలకు అతీతంగా శ్రమించాలని, ప్రామాణికంగా వ్యవహరించాలన్నారు. అప్పుడే సహకారబ్యాంకుల మనుగడ సాధ్యమన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్ మునిశామప్ప, వీ మునియప్ప, వెంకటరాయప్ప తదితర నాయకులు శ్రమించి పోషించిన సహకార సంఘాలు కొనసాగేందుకు మనవంతు కృషి చేద్దామన్నారు. బ్యాంకు అధ్యక్షుడు డీసీ రామచంద్ర 2022-23 వార్షిక జమాఖర్చు, 2023-24 వార్షిక బడ్జెట్‌ను సమర్పించి ఆమోదం పొందారు. కార్యక్రమంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు నారాయణప్ప, సహకారబ్యాంకు డైరెక్టర్ సొణ్ణేగౌడ, కేఎంఎఫ్ డైరెక్టర్ శ్రీనివాసరామయ్య, డీసీసీ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షుడు డాల్ఫిన్ నాగరాజ్, మాజీ అధ్యక్షుడు మునియప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి నివాళి



నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



శ్రీనివాస్ (ఫైల్)

బాగేపల్లి, సెప్టెంబరు 26: తాలూకాలోని ఘంటంవారిపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉన్న ఎన్ శ్రీనివాస్ (45) అనారోగ్యంతో గురువారం ఉదయం కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. అయినా చికిత్సలు ఫలించక మృతి చెందారు. తాలూకాలోని కానగమాకలపల్లి, మిట్టేమరి హైస్కూల్‌లో పనిచేసిన ఆయన కొన్నేళ్లుగా ఘంటంవారిపల్లి హైస్కూల్‌లో కొన సాగుతున్నారు. సుమారు 16ఏళ్లపాటు టీచర్‌గా కొనసాగిన శ్రీనివాస్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన అకస్మిక మృతికి తాలూకాలోని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో పలువురు కడపటి నివాళులు అర్పించారు. ఆయన సేవలను ఉపాధ్యాయులు, విద్యార్థులు స్మరించుకున్నారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి, బీఈఓ వెంకటేశప్ప, ఆర్ వెంకటరామ్, ఆర్ హనుమంతరెడ్డి, వెంకటరాయప్ప, ప్రధానోపాధ్యాయురాలు రామసుబ్బమ్మ, ఇతర ఉపాధ్యాయలు, కుటుంబీకులు సంతాపం వ్యక్తం చేశారు.

వారపుసంతలో సౌకర్యాల లేమి

శిడ్లఘట్ట, సెప్టెంబరు 26: పట్టణంలోని వారపుసంతలో పలు సమస్యలు ఉన్నాయి. సంతలో వ్యాపారంకోసం వచ్చే వ్యాపారస్తులతోపాటు కొనుగోలు దారులు సైతం పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంతమైదానంలో స్వచ్ఛ త లేదు, దుకాణాల ఏర్పాటుకు కొన్ని చోట్ల షీట్‌లు ఉన్నా అవి రంధ్రాలు ఉండడంతో వర్షం కురిసినవేళ సామగ్రి తడిసిపోతోంది, కనీస విద్యుద్దీపాలు కూడా లేకపోవడంతో సాయంత్రమైతే సరుకుల తరలింపు సమస్యగా మారింది. ఎన్నో ఏళ్లుగా ప్రతిసోమవారం వారపు సంత కొనసాగుతోంది. సంత మైదా నంలోని శౌచాలయానికి తాళం వేయడంతో మూత్రవిసర్జనకోసం మహిళలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంత మైదానం సమస్యలపై నగరసభ అధికారుల దృష్టికి తెచ్చినా ప్రయోజనం లేకపోయింది. అయితే ప్రతి వారం సంతకు సుంకం వసూలు మాత్రం ఆపడం లేదని కనీస సదుపాయాలు కల్పిం చడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని వ్యాపారస్తులు వాపోతున్నారు. మరోవైపు రోడ్డుపక్కనే డ్రైనేజీ కాలువ ఉన్నా కనీసం అడ్డుకట్టగా గోడ కూడా లేక పోవడంతో దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నామని విచారం వ్యక్తం చేశారు.



వారపుసంతలో డ్రైనేజీ పక్కనే దుకాణాల ఏర్పాటు ఇలా..

పీహెచ్‌సీలో కొరవడిన స్వచ్ఛత



ఆసుపత్రి ప్రాంగణంలో పేరుకున్న చెత్తా చెదారం

చేళూరు, సెప్టెంబరు 26: ఆరోగ్యాన్ని కాపాడాల్సిన చేళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లోనే స్వచ్ఛత కొరవడింది. ఇక్కడి ఆరోగ్యకేంద్రానికి చుట్టు పక్కల గ్రామాలనుంచి ప్రజలు వైద్యంకోసం వస్తుం టారు. ఆసుపత్రి ప్రాంగణంలో స్వచ్ఛత కొరవడడమే కాక సరైన మరుగుదొడ్డి సదుపాయం లేదని పలువురు రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో స్వచ్ఛతా పాటించేలా ఉన్నతాధికారులు చొరవ చూపా లనే డిమాండ్ ఉంది. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ఆసుపత్రిలోనే తగిన స్వచ్ఛత లేకుంటే ఎలాగని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పీహెచ్‌సీలో మేల్ డాక్టర్ కొరత ఉందని భర్తీ చేయాలని ప్రజలు కోరు తున్నారు. కాగా మెరుగైన వైద్య సేవలకోసం రెగ్యులర్ డాక్టర్‌లను నియమించాలని కోరుతున్నారు.

యువ దంపతులకోసం ప్రత్యేక బీమా పాలసీ

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): యువ దంపతులు, కాబోయే తల్లిదండ్రులకు ప్రత్యేక బీమా పాలసీని అమలులోకి తెచ్చినట్టు ఆదిత్యబిర్లా హెల్త్ బీమా కంపెనీ ప్రకటించింది. బెంగళూరులో గురువారం కంపెనీ సీఈఓ మయాంక్ బత్వాల్ పేరిట ఒక ప్రకటన విడుదల చేశారు. హెల్త్ బూస్టర్, మెటర్నిటీ కవర్ రైడర్‌లు పరిచయం చేసేందుకు పాలసీబజార్‌తో ఒ ప్పందం చేసుకున్నట్టు ప్రకటించారు. ఈ మార్పు మాతృ త్వబీమా రంగంలో కొత్తదనం కానుందన్నారు. ఏ దశలో నైనా ప్రయోజనం పొందేందుకు వీలుంటుందని పాలసీ బజార్ ఫిన్‌టెక్ సీఈఓ సర్బ్‌వీర్‌సింగ్ తెలిపారు.

అర్ధరాత్రి పూజలు..!

● జంతుబలిపై కేసు నమోదు

హిందూపురం, సెప్టెంబరు 26: కంప్యూటర్ యుగంలోనూ మూఢనమ్మకాలు వీడట్లేదు. హిందూ పురం మండలం జీవ్‌మాకులపల్లికి చెందిన హనుమం తప్ప, అతడి కుమారుడు గిరీష్ ద్విచక్రవాహనంలో ఈనెల 2న ఉదయం పొలం వద్దకు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికెళ్తుండగా లేపాక్షి మండలం పులమతి రోడ్డులో వెనుకవైపు నుంచి బుల్లెట్ వాహనం ఢీకొంది. దీంతో హనుమంతప్ప తలకు బలమైన గాయమై, కోమాలోకి వెళ్లాడు. అతడి కుమారుడు గిరీష్. ఓ పూజారిని సంప్రదించగా.. ప్రమాదస్థలంలో పూజలు చేయిస్తే నయం అవుతుందని చెప్పాడు. ఆ మేరకు కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన ముని యప్ప అనే మాంత్రికుడి ద్వారా ఈనెల 24న అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో రోడ్డు ప్రమాద ప్రాంతంలో పూజలు చేశారు. భయానక బొమ్మను తయారుచేసి, జంతుబలి ఇచ్చాడు. మరుసటిరోజు అటుగా వెళ్లేవారు నడిరోడ్డుపై పూజలు చేయడం, అక్కడున్న భయానక బొమ్మ, రక్తం పడి ఉండడాన్ని చూసి భయభ్రాంతులకు లోనయ్యారు. దీనిపై డీఎస్పీ మహేష్‌ను అడగ్గా.. దేవుని పేరు చెప్పి ఇలాంటి వాటికి పాల్పడితే మాంత్రికులైనా, తాంత్రికులైనా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 26: పట్టణం లోని కోనాపురంలో మిద్దెపై నుంచి పడి బండారు సోమ శేఖర్‌రెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇంట్లో టీవీ రాలేదని బండారు సోమశేఖర్‌రెడ్డి డిష్‌వైరును సరిచేయ డానికి సమీపంలోని ఇంటిపైకి ఎక్కాడు. ప్రమాదవ శాత్తు పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థాని కులు గమనించి 108కు సమాచారం అందించారు. ఎంత సేపటికీ 108 రాకపోవడంతో ఆటోలో బాధితుడిని తర లించగా మార్గమధ్యలో 108వాహనం ఆపి ఎక్కించుకుని ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్‌కూడా లేకపోవడంతో సిబ్బందే చికిత్సను అందిం చారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు

గోరంట్ల, సెప్టెంబరు 26: మండలంలోని సింగిరెడ్డి పల్లి సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఐదు గురు గాయపడ్డారు. గోరంట్లనుంచి గంగాదేవిపల్లికి గురువారం వెళ్తుండగా సింగిరెడ్డిపల్లి సమీపంలో కుక్క అడ్డురావడంతో ఆటో బోల్తాపడింది. గంగాదేవిపల్లికి చెందిన వృద్ధ దంపతులు మోపిరెడ్డి, లక్ష్మీదేవి, అదే గ్రామానికి చెందిన సువర్ణ, ఆటో డ్రైవర్ నంజుడప్ప, గోరంట్లకు చెందిన సరోజమ్మ తీవ్రవంగా గాయపడ్డారు. గాయపడిన వీరిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చగా, డాక్టర్ ఉషా చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం 108లో వారిని హిందూపురం తరలించారు ప్రమాదం గురించి వైద్యసిబ్బంది పోలీసులకు సమా చారం అందించారు.